# నా పేరేంటి?

పసి పిల్లలకు ఆనందం కలిగించడం కోసం జ్ఞాపకశక్తి పెంచడం కోసం చెప్పే "అనగా అనగా కథలెన్నో" అలాటి కథలో ఇల్లలుక్కున్న ఓ ఈగ పేదరాశి పెద్దమ్మను మొదలు గుజ్జం కడుపులోని పిల్లవరకు అందరినీ ఓ వింత ప్రశ్న వేసింది. అదే వింత ప్రశ్న ముద్దుగా బొద్దుగా ఉన్న ఓ మూడేళ్ళ పాప తన పెద్దత్తను అడిగింది.

ఊహ తెలిసి మాటలు కొద్దిగా వచ్చిన ఏ పాప, బాబు ఇలాటి ప్రశ్న వేయరు కనుక ఇది వింత ప్రశ్నకాక ఏమౌతుంది? ఆ ప్రశ్నకి సావిత్రి గుండె ఝల్లుమంది. బదులు చెప్పడానికి కదలలేక పోయాయి ఆమె పెదవులు. మనసుకే తెలియని జవాబు పెదవుల కెలా తెలుస్తుంది మరి! "నా పేరేంటి పెద్దత్తా? చెప్పత్తా. నా పేరు చెప్పు." సావిత్రి ఒడిలో కూర్చొని ముఖం పట్టి ఊపేస్తూ మళ్ళీ మళ్ళీ అదే ప్రశ్న వేస్తోంది పాప. సావిత్రి స్తాణువులా ఉండిపోయింది. ఏం చెప్పగలదు తను! ఈ ఇంట్లో ఎవరికీ ఇంతవరకూ ఈ ఆలోచనే రాలేదు. కనీసం తనైనా ఆలోచించిందా? పాపకి ఓ పేరు పెట్టాలి

అని. అలానే మారాం చేస్తున్న పాప మాత్రం "పాపా" అని తోటి పిల్లలెవరో ఆడుకోడానికి పిలిచేసరికి బయటకి వెళ్ళిపోయింది. తన వొడిలో నిండుగా కూర్చున్న పాప చెంగున లేడి పిల్లలా పరుగెత్తి వెళ్ళిపోయేసరికి ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చింది సావిత్రి. తోటి పిల్లలతో ఆట పాటలతో మునిగిపోయిన పాపైతే తనడిగిన ప్రశ్నను అప్పటికి మరచిపోయిందేమో కాని, ఆ చిన్నారి మరీ మరీ వేసిన ఆ ప్రశ్న సావిత్రిని కలవర పెడుతోంది. పుట్టి పది రోజులు కాగానే పెద్ద పండుగ చేసి పెడతారు పేరు ప్రతి బిడ్డకి. కాని....కాని తను, అమ్మ, నాన్న, తమ్ముడు, చెల్లెలు అందరుండి కూడా పాప, పాప గానే ఉండిపోయింది. ఎందుకు ? సావిత్రి మనసు గతంలోకి జారి పోయింది. తనకు పదేళ్ళు వచ్చేదాకా అమ్మానాన్నలకు తానొక్కతే గారాలపట్టి. అయినా అమ్మానాన్నల గారాలు, మురిపాలు తనొక్కతే పంచుకోడం సావిత్రికి బాగుండేది కాదు. తనకూ ఎంచక్కా తమ్ముళ్లు చెల్లెళ్లు ఉంటే, ఆహా! అలా అయితే వాళ్ళకి కథలు, కబుర్లు చెబుతూ, ఆటలు పాటలూ నేర్పిస్తూ మురిసిపోవచ్చు, అని అనుకొనేదెప్పుడూ! ఒకసారి అమ్మనాన్నలతో తిరుపతి వెళ్ళింది సావిత్రి. "ఏడుకొండల వాడు మనం ఏమడిగినా ఇస్తాడు. దణ్ణం పెట్టి నీ మనస్సులో కోరిక దేముడికి చెప్పుకో" అంది అమ్మ.

"క్లాసులో ఎప్పుడూ ఫస్టొచ్చి, పెద్ద చదువులు చదువుకోవాలి అని కోరుకో" నాన్న మాట పూర్తి కాకుండానే, "ఏ చదువులూ అక్కరలేదే తల్లీ! మంచి మొగుడు రావాలని కోరుకో చాలు" అంది అమ్మ. తనకవేమి పట్టలేదు. తనకెప్పటినుంచో ఉన్న కోరికే ఆ వేంకటేశ్వరస్వామికి విన్నవించుకొంది. సంవత్సరం తిరిగే సరికి ఓ చిట్టి తమ్ముడు తన ఒడిలో కొచ్చేసాడు. సావిత్రికి తమ్ముడంటే ప్రాణం! బడికి వెళ్ళేటప్పుడు తప్ప వాడ్ని విడిచి ఉండేది కాదు.

పెరుగుతున్న మురళి కూడ అక్కంటే ఎనలేని అనురాగాన్ని, అభిమానాన్ని పెంచుకొన్నాడు. మురళికి ఎనిమిదేళ్లు వచ్చాక ఆ అక్కా తమ్ముళ్లకి ఓ చెల్లి కూడా పుట్టింది. చెల్లిని చూసి ఎంతో ముచ్చటపడింది

కాని ఆ పాపాయి తప్పటడుగులు వేస్తూండగానే తను రవీంద్రతో ఏడడుగులు నడిచేసి సావిత్రీరవీందర్‌గా కలకత్తా వెళ్ళిపోయింది.

ఆ పెద్ద నగరంలో సావిత్రి చిన్న కాపురం. భర్త ఆఫీసుకి వెళ్ళిన దగ్గరినుంచి వంటరిగా ఫీలయ్యేది. చెల్లాయి తనతో ఉంటే బావుంటుందనీ అనుకున్న తను అమ్మను బతిమాలింది. అమ్మ నవ్వి, "నీకు ఇదెందుకే? ఇప్పటి నుంచి బెడద" కాని అమ్మ మనసులో మాట తనకు తెలియదా! అమ్మే దాన్ని వదిలి ఉండ లేదు. తనకు వెంటనే నెలతప్పితే బాగుణ్ణు. అమ్మనాన్నల దగ్గర ఉండి ఓ ఆరునెలలు చెల్లాయి ఆటలు చూస్తూ బుడి బుడి మాటలు నేర్పించొచ్చు. ఆపైన ఒంటరితనం ఉండనే ఉండదు. తన ఇంటే ఓ చిన్నారి. తనకు కాలం ఇట్టే గడిచిపోతుంది. అప్పటి అమాయకపు ఊహలు గుర్తొచ్చినప్పుడల్లా నవ్వుకుంటుంది సావిత్రి. ఆ మోస్తరు నవ్వే సావిత్రి ముఖంలో చోటు చేసుకుంది. ఆ ఊహలు వెంటనే నిజమయ్యాయి. తను పురిటికి పుట్టింటికి వచ్చేసింది. పాప పుట్టిన మరునాటినుంచి "ఏ పేరు పెడతావే సావిత్రీ మీ గారాల చిట్టికి" స్నేహితులు, చుట్టాలు గమ్మత్తుగా అంటం మొదలుపెట్టారు. నిజమే! పాపకు ఏ పేరు పెడితే బాగుంటుంది? మల్లెపూల రాశి పోసినట్టున్న తన చిట్టి మల్లి. పెద్దయితే అలా తెల్లగా ఉంటుందేమో కాని ఇప్పుడు మాత్రం గులాబి బాలలా లేదూ! అచ్చం